## అధ్యాయము 26

# దీవెనలు మరియు శాపములు

క్రీ.పూ. రెండవ సహస్రాబ్దిలోని ప్రాచీన పశ్చిమ ఆసియాలో అధిక శక్తికి (సుజోరైన్) మరియు తక్కువ శక్తికి (ఒక దావా రాజ్యం) మధ్య అంతర్జాతీయ ఒప్పందాలు సాధారణంగా ఒక నిర్దిష్ట రూపాన్ని తీసుకువచ్చాయి. (1) తన సామంత రాజుతో ఒక ఒప్పందం/ఒడంబడిక చేసుకొనిన గొప్ప రాజు యొక్క పేరు మరియు గుర్తింపుతో వారు మొదలుపెట్టారు. (2) తరువాత వారు ఒడంబడికకు రెండు పార్టీల మధ్య ఉన్న చరిత్రను అభ్యసించేవారు. (3) వారు ఒక నియమావళిని కలిగి ఉండేవారు - తక్కువ శక్తి గలవారు సంతృప్తిపరచవలసిన కాంక్షలు. (4) ఒప్పందము యొక్క స్వీకర్త (తక్కువ శక్తి) ఒప్పందపు కాంక్షలను ఆచరించినట్లయితే ఎలా ఆశీర్వదించబడుతుందో, మరియు ఒప్పందపు కాంక్షలను ఆచరించకపోయినట్లయితే అది ఎలా శపించబడుతుందో లేదా శిక్షించబడుతుందో అనుదానిని గూర్చి వారు ఒప్పందపు ఆశీర్వాదాలు మరియు శాపాలను తెలియజేసేవారు.[1]

సీనాయి పర్వతము యొద్ద (ఆయన వారికి ఆజ్ఞలను ఇచ్చినప్పుడు) ఆయన ప్రజలకు దేవునిచే చేయబడిన నిబంధన అనునది suzerain-vassal ఒడంబడిక రూపములో ఉన్నది. నిర్గమకాండము 19 మరియు 20లో, ఇశ్రాయేలునకు గొప్ప రాజుగా ఉండుటకు గల ఆయన పేరును మరియు అర్హతను యెహోవా ఇచ్చెను. నిబంధనకు రెండు భాగాలకు మధ్యనున్న ప్రథమ చరిత్రను అప్పుడు ఆయన జ్ఞాపకముచేసెను: ఐగుప్తు బానిసత్వమునుండి ఆయన ఇశ్రాయేలును విడిపించెను. నిర్గమకాండము మరియు లేవీయకాండములో, నిబంధన/ఒడంబడిక యొక్క షరతులను దేవుడు చెప్పెను - ఆజ్ఞలు మరియు ఇశ్రాయేలీయులు అనుసరించవలసిన నియమాలు. లేవీయకాండము 26లో ఇశ్రాయేలీయులు అనుసరించుటలో వచ్చే దీవెనలను మరియు అవిధేయత చూపుటలో వచ్చే శాపాలను చెప్పుచు నిబంధన అనే ప్రత్యక్షతను ఆయన ముగించెను.

1వ అధ్యాయము నుండి 25 వరకు కనబడే నియమాలకు లేవీయకాండము 26వ అధ్యాయం అనునది ముగింపుగా ఉన్నది. దేవుడు ఇచ్చిన నియమాలను పాటించుటకు అది రెండు మంచి కారణములను ఇశ్రాయేలీయులకు అందజేస్తుంది: వారు అనుసరిస్తే దీవించబడతారు; వారు అనుసరించకపోతే, వారు శపించబడతారు.

## నిబంధన యొక్క ప్రాథమిక అవసరతలు (26:1, 2)

**[1]మీరు విగ్రహములను చేసికొనకూడదు. చెక్కిన ప్రతిమనుగాని బొమ్మనుగాని నిలువపెట్టకూడదు. మీరు సాగిలపడుటకు ఏదొక రూపముగా చెక్కబడిన రాతిని మీ దేశములో నిలుపకూడదు. నేను మీ దేవుడనైన యెహోవాను. [2]నేను నియమించిన విశ్రాంతి దినములను మీరు ఆచరింపవలెను, నా పరిశుద్ధమందిరమును సన్మానింప వలెను, నేను యెహోవాను.**

నిబంధనకు సంబంధించి ప్రతిఫలములు మరియు శిక్షలను గూర్చిన ఆయన సందేశమును యెహోవా ప్రారంభించక ముందు, నియమము యొక్క ప్రాథమిక అవసరతలను ఆయన ఇశ్రాయేలునకు జ్ఞాపకముచేసెను.

**వచనములు 1, 2.** ఈ వచనములు మునుపటి ఇరవై అయిదు అధ్యాయాలలో కనిపించే శాసనాలకు సారంశముగా చూడవచ్చు. యెహోవా ఆయన ప్రజల నుండి ఏమి కోరెను?

పది ఆజ్ఞలలో మొదటి రెండు ఆజ్ఞల ప్రకారం ఇశ్రాయేలీయులు విగ్రహారాధనను తిరస్కరించి, దేవుని మాత్రమే సేవింపవలెను. వారు ఈ విషయాలను ఖచ్చితంగా చూసుకొనవలెను (1) వారు **విగ్రహాలను** చేసుకొనకూడదు, (2) భూమిలో ఏ **రూపమునైనను** మ్రొక్కకూడదు, మరియు (3) **ప్రతిమనుగాని చెక్కబడిన రాతికి గాని** సాగిలపడకూడదు. ఈ విధమైన విగ్రహారాధన యొక్క అన్నీ రూపాలు కనాను దేశము మరియు ఈశాన్యాన దేశాములన్ని బహుగా విస్తరించబడినవి. కనాను దేశస్థులు మరియు చుట్టుప్రకలనున్న దేశస్థుల వలె ఇశ్రాయేలు దేశపువారు ఇతర అన్య దేవతలను అరాధించకూడదు, ఇదే వారియొక్క ప్రథమ ప్రత్యేకత. వారు పూర్తి గౌరవాన్ని ఆయనకు మాత్రమే ఇవ్వవలెను అని ఆయన జ్ఞాపకము చేయుటలో, ఆయన పరిశుద్ధుడైనట్లు వారు కూడా పరిశుద్ధంగా ఉండాలనే వారి బాధ్యతను యెహోవా వక్కాణిస్తున్నాడు. వారు వారి తోటి మనుష్యులకు ప్రేమను ప్రదర్శిస్తూ స్వచ్ఛంగా మరియు నైతికంగా జీవించాలని వారు భావించబడినారు.

ప్రజలు యెహోవా యొక్క **విశ్రాంతిదినములను ఆచరింపవలెను** మరియు [ఆయన] **పరిశుద్ధ మందిరమును సన్మానింపవలెను.** బహుశా, మందిరము, ఆరాధన, బలులకు సంబంధించి లేవీయకాండములో కనుపరచబడిన అవసరతలన్నిటిని ఈ ఆజ్ఞలో కలపాలని యెహోవా ఉద్దేశించియుండవచ్చు. 23వ అధ్యాయము నుండి 25వ అధ్యాయము వరకు ఉన్న దేవుని యొక్క ప్రత్యేక సమయాలలో జరిగే ఆచరాలన్నీ ఇక్కడ కలపబడియున్నవి.

**నేను యెహోవాను** అని మరలా చెప్పుట ద్వారా ఆయన పదాల యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పుట ద్వారా యెహోవా ముగించెను.

## దీవెనలు (26:3-13)

ఆయన శాసనాలను అనుసరించుటకు ప్రోత్సాహకంగా (26:1, 2), ఇశ్రాయేలు

ఆయనను అనుసరించినట్లైతే అద్భుతమైన దీవెనల యొక్క నాలుగు గుంపులను యెహోవా వాగ్దానం చేసెను.

## 1. సమృద్ధియైన పంటలు (26:3-5)

**[3]మీరు నా కట్టడలనుబట్టి నడుచుకొని నా ఆజ్ఞలను ఆచరించి వాటిని అనుసరించి ప్రవర్తించినయెడల [4]మీ వర్షకాలములలో మీకు వర్షమిచ్చెదను, మీ భూమి పంటల నిచ్చును, మీ పొలములచెట్లు ఫలించును, [5]మీ ద్రాక్ష పండ్ల కాలమువరకు మీ నూర్పు సాగుచుండును, మీరు తృప్తిగా భుజించి మీ దేశములో నిర్భయముగా నివసించెదరు.**

**వచనము 3.** ఇశ్రాయేలీయులకు వారి బాధ్యతలను తెలుపుటకు యెహోవా యొక్క జ్ఞాపికతో ఆశీర్వాదంపై ఉన్న ఈ విభాగం ప్రారంభమవుతుంది: వారు [ఆయన] **కట్టడలనుబట్టి నడుచుకొనవలెను** మరియు [ఆయన] **ఆజ్ఞలను ఆచరించవలెను**. ఆయన ఆజ్ఞలు అనుసరింపబడవలెనని దేవుడు ఉద్దేశించెను.

**వచనములు 4, 5.** ఇశ్రాయేలీయులు ఆయనను అనుసరించిన యెడల, వారు తృప్తికరమైన పంటలను అనుభవించెదరు అని యెహోవా వాగ్దానం చేసెను. పొలములలో పంటలు పండులాగున మరియు **ఫలము** ద్రాక్షతోటలలో **చెట్లలో** ఉండులాగున దేవుడు **వర్షమును** పంపును. పండిన ధాన్యము దాని **నూర్పు** సాగుచుండునట్లుండే అంత సమృద్ధిగా ఉంటుంది, చలికాలములోని పంట, **ద్రాక్షపండ్ల** కాలమైన ఎండా కాలము చివరి వరకు ఉంటుంది. ఇంకా, ద్రాక్షపండ్ల యొక్క పంట మరలా ధాన్యము ప్రారంభమయ్యే **సమయము** వరకు సమృద్ధిగా ఉంటుంది! ఈ సమృద్ధికరమైన పంటలనుండి, వారు **తినుటకు** సమృద్ధియైన **ఆహారం**[2] ఉంటుంది; మరియు [వారి] **దేశములో** వారు **సురక్షితముగా** నివసించుదురు. వారియొక్క వ్యవసాయ సమాజములో, మంచి వాతావరణము మరియు అనుకూలమైన వర్షము అనునవి మంచి పంటలకు దారితీస్తుంది, అది తిరిగి భద్రతను కల్పిస్తుంది.

## 2. శాంతియుతంగా జీవించుట (26:6-8)

**[6]ఆ దేశములో నేను మీకు క్షేమము కలుగజేసెదను. మీరు పండుకొనునప్పుడు ఎవడును మిమ్మును భయపెట్టడు, ఆ దేశములో దుష్టమృగములు లేకుండ చేసెదను, మీ దేశములోనికి ఖడ్గమురాదు; [7]మీరు మీ శత్రువులను తరిమెదరు; వారు మీ యెదుట ఖడ్గముచేత పడెదరు. [8]మీలో అయిదుగురు నూరుమందిని తరుముదురు; నూరుమంది పదివేలమందిని తరుముదురు, మీ శత్రువులు మీయెదుట ఖడ్గముచేత కూలుదురు.**

**వచనములు 6-8.** శాంతి అనే దీవెనను వారు అనుభవిస్తారని తరువాత యెహోవా ఆయన ప్రజలకు వాగ్దానం చేసెను. భయము లేకుండా వారు వారి యొక్క భూమిలో ఉండెదరు. ఎలా? **దుష్టమృగములను** ఆయన **లేకుండా** చేసెదనని యెహోవా చెప్పెను. ఉదాహరణకు, సింహములచేత ఆ దేశము నాశనము చేయబడదు. మరియు, మీ

**దేశములోకి ఖడ్గము** రాదు అని కూడా ఆయన వాగ్దానం చేసెను, స్పష్టంగా యుద్ధం యొక్క ఖడ్గం ద్వారా ఆ ప్రజలందరూ భయపడనవసరం లేదు లేదా గాయపరచబడరు అని అర్థము (26:6).

ప్రజలు ఖడ్గమునకు భయపడనవసరంలేదు, ఎందుకనగా ఇశ్రాయేలు యొక్క యుద్ధ వీరులు వారికి ఎదురుగా వచ్చు శత్రు బలగమును సులువుగా ఓడించగలరు. ఇశ్రాయేలీయులు [వారి] **శత్రువులను తరిమెదరు** మరియు . . . **ఖడ్గముచేత పడెదరు** (26:7). వాస్తవానికి, **అయిదుగురు** ఇశ్రాయేలీయులు **నూరుమంది** శత్రువులను జయిస్తారు, మరియు **నూరుమంది** ఇశ్రాయేలీయుల వీరులు **పదివేలమంది** శత్రు సైన్యాన్ని జయిస్తారు (26:8)! ఎవ్వరు వారి యెదుట నిలబడకుండునట్లు దేవుడు ఇశ్రాయేలును యుద్ధములో దీవించును. దేవుని దీవెన యొక్క ఫలితం ఏమనగా ఆ జనాంగము శాంతితో జీవిస్తారు.

### 3. పెరుగుతున్న జనాభా మరియు సమృద్ధియైన ఆహారం (26:9, 10)

**[9]ఏలయనగా నేను మిమ్మును కటాక్షించి మీకు సంతానమిచ్చి మిమ్మును విస్త రింపజేసి మీతో నేను చేసిన నిబంధనను స్థాపించెదను. [10]మీరు చాలాకాలము నిలువైయున్న పాతగిలిన ధాన్యమును తినెదరు; క్రొత్తది వచ్చినను పాతది మిగిలి యుండును.**

**వచనములు 9, 10.** వారు ఆయన ఆజ్ఞలను అనుసరించిన యెడల, ఫలవంతముతో మరియు సమృద్ధియైన ఆహారముతో ఆయన వారిని ఆశీర్వదించెదను, అని కూడా యెహోవా ఆయన ప్రజలకు వాగ్దానం చేసెను. **ఏలయనగా నేను మిమ్మును కటాక్షించి మీకు సంతానమిచ్చి మిమ్మును విస్త రింపచేసి మీతో నేను చేసిన నిబంధనను స్థాపించెదను**, అని ఆయన వాగ్దానం చేసినప్పుడు, అబ్రాహాముకు శతాబ్దాల పూర్వం చేసిన వాగ్దానాలను ఇశ్రాయేలీయులు తప్పకుండా జ్ఞాపక చేసుకున్నారు (ఆది. 12:2; 17:6; 22:17). దేవుడు అబ్రాహామునకు ఏమి చేసెనో, ఇప్పుడు వారికి కూడా చేయునని వాగ్దానం చేసెను. ఈ దీవెన ఇశ్రాయేలుతో చేసిన **నిబంధనకు** అనుగుణంగా ఉన్నది.

ఈ పెరుగుతున్న జనాభాను కొనసాగించేందుకు, ముందు సంవత్సరపు పంటలోని ధాన్యమును **(పాతగిలిన)** వారు **తిందురని** దేవుడు వాగ్దానం చేసెను; మరియు **నిలువ** ఉన్న ఆహారం గడిచిపోయేముందు, ఇటీవల పంట **(క్రొత్తది)** కోసం గదిని తయారు చేయడానికి ఇది ప్రక్కన పెట్టవలసి ఉంటుంది.[3] తినుటకు ఎల్లప్పుడూ సమృద్ధిగా ఉంటుంది.

### 4. దేవుని సాన్నిధ్యం (26:11-13)

**[11]నా మందిరమును మీ మధ్య ఉంచెదను; మీ యందు నా మనస్సు అసహ్యపడదు. [12]నేను మీ మధ్య నడిచెదను మీకు దేవుడనైయుందును; మీరు నాకు**

**ప్రజలై యుందురు. [13]మీరు ఐగుప్తీయులకు దాసులు కాకుండ వారి దేశములోనుండి మిమ్మును రప్పించితిని; నేను మీ దేవుడనైన యెహోవాను. నేను మీ కాడి పలుపులను తెంపి మిమ్మును నిలువుగా నడవచేసితిని.**

**వచనములు 11-13.** చివరిగా, ఇశ్రాయేలు ఆయనకు విధేయత చూపితే, ఆయన తన ప్రజల మధ్య నివాసము చేయునని యెహోవా వాగ్దానము చేసెను. ఆయన వారిమీద **అసహ్యపడడు**[4], కానీ వారి **మధ్య నడుచును.** ఆయన వారి **దేవుడైయుండును**, మరియు వారు ఆయన **ప్రజలైయుందురు** (26:11, 12). ఈ చివరి ఆశీర్వాదం అనునది దేవుడు చేయగల ఉత్తమమైన వాగ్దానం: ఆయన ఇశ్రాయేలుతో ఉండును! ఆయన సాన్నిధ్యం వారిని దీవించును.

ఇశ్రాయేలును దీవించుట కొరకు ఉద్దేశముగా, మరియు ఆయన వాగ్దానం చేసినదానిని చేయగల సామర్థ్యం కలిగియున్నాడను దానికి రుజువుగా, ఆయన ముందు ఏమి చేసెనో దానిని దేవుడు పేర్కొనెను: **ఐగుప్తు** బానిసత్వమునుండి ఆయన వారిని విడిపించెను! అలంకారంగా మాట్లాడితే, ఐగుప్తులో నుండి బయటకు నడిపించుటలో, ఐగుప్తీయులు ఆ దేశము యొక్క మెడమీద నుంచిన బానిసత్వము యొక్క **కాడిని** దేవుడు **తెంపివేసెను**. ఫలితముగా, ప్రజలు **నిలువుగా నడిచిరి**, ఇకమీదట బానిసత్వము వలన వారు వంగిపోలేదు (26:13). దేవుడు వారిని గతంలో దీవించెను కాబట్టి, భవిష్యత్లో నెరవేర్చబడే ఆయన యొక్క వాగ్దానాల కొరకు వారు వేచి చూడవచ్చు.

## శాపములు (26:14-43)

26:14-39 సంబంధించి, Matthew Henry ఇలా వ్రాసారు, "దేవుడు వారి ముందు దీవెనలను ఉంచిన తరువాత వారి ముందు శాపాలను కూడా ఉంచాడు, వారు అవిధేయులైతే, వారిని దుర్మార్గంలోకి మరణము మరియు చెడుతనము నడిపిస్తాయి."[5] అవిధేయతకు అనుబంధించబడియున్న శాపాలు అనునవి ముందు వాగ్దానం చేయబడిన దీవెనలకన్నా ఎక్కువగా ఉన్నాయి; దీవెనలు పదకొండు వచనములలో చెప్పబడినవి, అయితే శాపాలు ఇరవైఆరు వచనములలో చెప్పబడినవి (దీనిని ద్వితీ. 28తో పోల్చండి). శాపాలు అనునవి ఐదు సమూహాలలో ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేయబడినవి.

ప్రజలకు అందించబడిన శాపాల యొక్క ప్రతి సమూహం వాటి ముందు ఉన్న వాటికన్నా అధ్వాన్నంగా మారాయి. ప్రజలను చెరలోకి విడుదలజేయుటకు, దేశమును నాశనం చేయుటకు (లేదా కనీసం జనమును వారి దేశం నుండి వేరుపరచుటకు) మరియు భూమిని పాడుచేయుటకు వారు దేవుని యొక్క ముప్పుకు దారితీసారు.

ప్రతి సమూహానికి ముందు "ఉంటే" అనుదానిని దేవుడు చేర్చెను. మొదట, ఆయన కేవలం ఇలా చెప్పెను, "మీరు నా ఆజ్ఞలను అనుసరించకపోతే, నేను మిమ్మును శపించెదను." ఇతరమైనవాటిని ఆయన ఈ ఆలోచనతో ప్రారంభించెను:

"మీరు పశ్చాత్తాపపడుటకు మరియు నా వైపు తిరుగుటకు ఇవి సహాయపడని యెడల - అవి తిరస్కరించి, మీరు నాకు విరుద్ధముగా తిరుగుబాటు చేయుట కొనసాగించిన యెడల - మిమ్మును నశింపజేసేంతగా ఏడు రెట్లు శాపాలను మీ మీదకు పంపుతాను."[6] చివరిగా, ఈ నాలుగు విధములైన శాపాలను అనుభవించిన తరువాత కూడా, ఆయన వైపు ప్రజలు తిరగకుండా ఆయన మాటకు విధేయత చూపని యెడల, ఆయన దేశమును నాశనము చేయునని దేవుడు చెప్పెను.

ఈ విషయాన్ని గుర్తిస్తే జాబితా చేయబడిన శాపాలు శిక్షలు కావని పాఠకుడు అర్థంచేసుకొనుటకు సహాయపడుతుంది. వారు అనుసరించుటలో విఫలమైతే శాపాలు అనునవి ప్రజలను శిక్షిస్తాయి, కానీ వారిని పశ్చాత్తాపములోకి నడిపించుటయే వాటియొక్క ఉద్దేశము! క్రొత్తనిబంధన చెప్పినట్లు, దేవుని ప్రజలు ఆయనవైపునకు మరలి ఆయన నియమాలను అనుసరించుట్లు వారిని శిక్షించుటకు అవి ఉద్దేశించబడినవి (హెబ్రీ. 12:5-11 చూడండి). వారిని పదేపదే శిక్షించిన తరువాత కూడా వారు పశ్చాత్తాపం చెందుటకు తిరస్కరించినప్పుడు మాత్రమే వారు బందీలుగా కొనిపోబడుటకు దేవుడు వారిని అనుమతించును.

## 1. వ్యాధి, కోత రాకపోవడం మరియు ఓటమి (26:14-17)

**[14]మీరు నా మాట వినక నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక [15]నా కట్టడలను నిరాకరించినయెడలను, నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక నా నిబంధనను మీరునట్లు మీరు నా తీర్పుల విషయమై అసహ్యించుకొనినయెడలను, [16]నేను మీకు చేయునదేమనగా, మీ కన్నులను క్షీణింపచేయునట్టియు ప్రాణమును ఆయాసపరచునట్టియు తాపజ్వరమును క్షయరోగమును మీ మీదికి రప్పించెదను. మీరు విత్తిన విత్తనములు మీకు వ్యర్థములగును, మీ శత్రువులు వాటిపంటను తినెదరు; [17]నేను మీకు పగవాడనవుదును; మీ శత్రువుల యెదుట మీరు చంపబడెదరు; మీ విరోధులు మిమ్మును ఏలెదరు; మిమ్మును ఎవరును తరుమకపోయినను మీరు పారిపోయెదరు.**

దేవుడు ఆయన ప్రజలను శపించుటకు గల కారణములను ఇస్తూ శాపముల జాబితాను ప్రారంభించెను. దీని తరువాత, ఇశ్రాయేలీయుల అవిధేయతను బట్టి వారిని ఎలా శిక్షించాలో ఆయన చెప్పాడు.

**వచనములు 14, 15.** ఒకరోజు ఇశ్రాయేలీయులు ఖచ్చితంగా ఆయనను విడిచిపెట్టి దూరముగా వెళ్లిపోయే అవకాశమును దేవుడు చూచాడు. ఆయన మాటలను **వినరు**; ఆయన **ఆజ్ఞలను అనుసరించరు**. [ఆయన] **కట్టడలను నిరాకరిస్తారు**, వారు దేవుని **తీర్పుల** విషయమై **అసహ్యించుకొందురు**, మరియు వారు [దేవుని] **నిబంధనలను మీరుతారు**. ఈ పాపములు అనుకోకుండా, ప్రమాదవశాత్తూ లేదా అప్పుడప్పుడు జరిగేవి కావు. ఉద్దేశపూర్వకమైన అవిధేయతనుబట్టి రాజ్యమును శిక్షించుతానని దేవుడు బెదిరించాడు.

**వచనములు 16, 17.** దేవునిని మరియు ఆయన మాటను ప్రజలు తిరస్కరిస్తే,

ఆయన వారిని శిక్షించును లేదా శపించును. తమ శరీరము **వ్యర్థములగుటకును** మరియు **ప్రాణములో** జీవించాలనిన ఆశను కోల్పోవునట్లు చేయు **క్షయరోగముతో** మరియు **తాపజ్వరముతో** ఆయన వారిని శారీరకముగా బాధించును.

అదియుగాక, వారు ఓటమిని అనుభవించునట్లు ఆయన చేయును. ఇశ్రాయేలీయులు విత్తనములు నాటుదురు, కాని వారి **శత్రువులు** వాటిని **తిందురు.** ఈ **శత్రువులు** ఇశ్రాయేలీయులను చంపి మరియు వారిని **ఏలుదురు.** దేవుని ప్రజల యొక్క ధైర్యము ఆరిపోతుంది; ఎవరును వారిని తరుమకపోయినను వారు **పారిపోవునట్టి** భయము వారికి కలుగుతుంది! వారి శత్రువుల చేతిలో ఓటమి తరువాత దేవుడు పంపిన వ్యాధులు వచ్చును.

## 2. కరవు మరియు దాని ఫలితాలు (26:18-20)

**18 ఇవన్నియు సంభవించినను మీరింక నా మాటలు విననియెడల నేను మీ పాపములను బట్టి మరి ఏడంతలుగా మిమ్మును దండించెదను. 19 మీ బల గర్వమును భంగపరచి, ఆకాశము ఇనుమువలెను భూమి ఇత్తడివలెను ఉండచేసెదను. 20 మీ బలము ఉడిగిపోవును; మీ భూమి ఫలింపకుండును; మీ దేశవృక్షములు ఫల మియ్యకుండును.**

రెండవ మారు కూడా వారు ఆయన నుండి తొలగిపోతారని దేవుడు ఆయన ప్రజలను బాధించుట కొనసాగించెను.

**వచనము 18. ఇవన్నియు సంభవించినను మీరింక నా మాటలు విననియెడల** . . . , అని చెప్పుటద్వార, ఇశ్రాయేలీయులను బాధించు మొదటి శిక్ష యొక్క ఉద్దేశము, ఆయన ప్రజలను అవిధేయత నుండి విధేయతలోనికి నడిపించుటకు అని ఆయన సూచించాడు. ఆయన ప్రజలను ఆయనవైపు త్రిప్పుకొనే ప్రణాళిక ఫలించనట్లైతే, మరియు వారు అవిధేయతను కొనసాగిస్తే, పర్యవసానాలు మరింత తీవ్రంగా ఉంటాయి. ఆయన [వారి] **పాపములను** బట్టి వారిని **మరి ఎడంతలుగా దండించును**. మరోమాటల్లో, శాపములలో రెండవ భాగము మొదటి దానికంటే ఎడంతలు బాధగా ఉంటుంది.

**వచనములు 19, 20.** ఈ భాగములో మనము చదువుకొను మొదటి శాపము ఏదనగా [ఇశ్రాయేలీయుల] **బల గర్వమును భంగపరచుట**. ప్రజలను క్షీణింపజేయుటవలన ఇశ్రాయేలీయులను ఆయన వినయముగలవరిగా చేయును. బహుశా, వారి బలహీనతనేది తరువాత చెప్పబడిన కరవు ఫలితం అయి ఉంటుంది.

స్పష్టమైన భాషను ఉపయోగించుచు, దేవుడు ఆయన ప్రజలను తీవ్రమైన కరువుతో బాధించెను - ఎంత తీవ్రమైన కరువంటే **ఆకాశము** ఇనుమువలె చేయబడినట్లు ఉంటుంది మరియు **భూమి ఇత్తడివలె** చేయబడినట్లు ఉంటుంది. అలాంటి కరవులో, భూమిని చేసేవారు **ఉడిగిపోదురు. భూమి ఫలింపదు** మరియు **వృక్షములు ఫలములియ్యవు**. ఈ వాక్యభాగము కరవు యొక్క మానవుల సుంకమును గూర్చి చెప్పలేదు గాని పాఠకులకు దాని యొక్క పర్యవసానములు

స్పష్టమౌతాయి. తినడానికి కొంచెము లేదా అస్సలు లేకుండా ఉన్నప్పుడు, గర్వించాలను కారణములను రాజ్యము కోల్పోతుంది. ఇది దేవుని కట్టడములను తిరస్కరించుటవలన వచ్చిన తీవ్రత అని ఇశ్రాయేలీయులకు ఈ శాపము బోధించియుండవచ్చును.

## 3. అడవిమృగముల తెగులు (26:21, 22)

**[21]మీరు నా మాట విననొల్లక నాకు విరోధముగా నడిచిన యెడల నేను మీ పాపములనుబట్టి మరి ఏడంతలుగా మిమ్మును బాధించెదను. [22]మీ మధ్యకు అడవిమృగములను రప్పించెదను; అవి మిమ్మును సంతాన రహితులగా చేసి మీ పశువులను హరించి మిమ్మును కొద్ది మందిగా చేయును. మీ మార్గములు పాడైపోవును.**

రెండు శాపముల తరువాత కూడా ఇశ్రాయేలీయులు విఫలమైతే, దేవుడు మూడవ ముప్పును జారీచేసాడు.

**వచనము 21.** ఆయన ప్రజలపై పంపించు విపత్తులలో కూడా, వారు తిరస్కరించి - **విరోధముగా నడిచిన యెడల** - ఆయన ఇశ్రాయేలీయులను **మరి ఏడంతలుగా బాధించును.** బహుశా, "బాధించు" అను పదము ఈ సమయము వరకు, మునుపు రెండు శాపములతో సహా దేవుడు వారిని శిక్షించిన ప్రతి శిక్షను సూచిస్తుంది. మరల, ఒక్కాణం ఏదనగా, దేవుడు ఇప్పుడు వారికి చేసే కార్యము మునుపు చేసిన దానికంటే "ఏడంతలు" ఎక్కువగా ఉంటుంది.

**వచనము 22. [వారి] మధ్యను అడవిమృగములను రప్పించెదనని** దేవుడు చెప్పాడు.[7] ఈ అడవిమృగములు వారిని **సంతానరహితులుగా** చేస్తాయి; అవి పిల్లలపై దాడిచేసి చంపి, జనాభాను తగ్గిస్తాయి. వాస్తవానికి, అనేకమంది చనిపోతారు **మార్గములు** పాడైపోతాయి. స్పష్టంగా, ఇది ఆయన ప్రజలను అభివృద్ధి చేయుదుననిన దేవుని వాగ్దానమునకు వ్యతిరేకంగా ఉంది. వారు విధేయత చూపితే దేవుడు వాగ్దానము చేసినదానికి, వారు అవిధేయులుగా ఉంటె ఆయన వ్యతిరేకంగా చేస్తాడనే ఆలోచనను ఇస్తుంది.

## 4. యుద్ధము, తెగులు, మరియు ఆకలి (26:23-26)

**[23]శిక్షలమూలముగా మీరు నాయెదుట గుణపడక నాకు విరోధముగా నడిచినయెడల [24]నేనుకూడ మీకు విరోధముగా నడిచెదను; మీ పాపములను బట్టి ఇక ఏడంతలుగా మిమ్మును దండించెదను. [25]మీమీదికి ఖడ్గమును రప్పించెదను; అది నా నిబంధనవిషయమై ప్రతి దండన చేయును; మీరు మీ పట్టణములలో కూడియుండగా మీ మధ్యకు తెగులును రప్పించెదను; మీరు శత్రువుల చేతికి అప్పగింప బడెదరు. [26]నేను మీ ఆహారమును, అనగా మీ ప్రాణాధారమును తీసివేసిన తరువాత పదిమంది స్త్రీలు ఒక్క పొయ్యిలోనే మీకు ఆహారము వండి తూనికెచొప్పునమీ ఆహారమును మీకు**

**మరల ఇచ్చెదరు, మీరు తినెదరు గాని తృప్తిపొందరు.**

మూడవ ముప్పు నెరవేర్పు మారుమనస్సు పొందుటకు ఆయన ప్రజలను పురికొల్పకపోతే, దేవుడు మరిన్ని తీవ్రమైన శాపములను పంపించెదనని చెప్పెను.

**వచనములు 23, 24.** ఈ అధ్యాయములోని శాపములకు కారణము ఆయనవైపు ఆయన ప్రజలను త్రిప్పుటకు లేదా మారుమనస్సును కలిగించుటకు అని దేవుడు పునరుద్ఘాటించాడు. ఈ శిక్షలకు ఎల్లప్పుడు కావలసినంత ప్రభావం ఉండదని కూడా చెప్పాడు. కావలసినంత ప్రభావం లేకపోతే, ఏంటి? మరిన్ని శిక్షలను పంపుటవలన ప్రజలు ఆయనవైపు తిరుగుతారని దేవుడు మరల ప్రయత్నించును.

ఇశ్రాయేలీయుల యొక్క నిరంతర అవిధేయతను గూర్చి మాట్లాడుతూ **విరోధముగా** ఉన్నారు అని చెప్పాడు. వారు కేవలము అపరాధులైన పరిశుద్ధులు లేదా తిరుగులాడు గొర్రెలు మాత్రమే కాదు; వారు దేవుని శత్రువులుగా ఉన్నారు అని సూచిస్తుంది. దేవుడు శిక్షిస్తున్నను, మారుమానస్సు పొందకయుండుట అనేది దేవుని ప్రజలు కేవలము అవిశ్వాసులైన స్నేహితులు మాత్రమే కాదుగాని దేవుని శత్రువులు. వారు దేవునికి విరోధులుగా ఉంటె, ఆయన వారియెడల **విరోధముగా ఉంటాడు.**

దేవుడు వారి పాపముల యెడల మరియు మారుమనస్సుపొందకుండా విఫలమైన విధానమును బట్టి ఆయన యొక్క విచారమును వ్యక్తపరచుటకు దేవుడు ఏమి చేస్తాడు? దేవుడు తానే వారిని (వారి) పాపముల నిమిత్తమై **ఏడు మారులు దండించును.** వారు మునుపు అనుభవించిన దానికంటే "ఏడంతలు" వారిమీదికి ఆయన రప్పించును. ఈ వచనములను గూర్చి, Roy Gane ఇలా చెప్పారు, "ఇప్పుడు ప్రజలు తమ సొంత-నాశనమునకు దారితీసిన తిరుగుబాటుపై నిషేదించుమని కోరతారు."[8]

**వచనము 25.** దేవుడు ఆయన యొక్క "విరోధమును" రాజ్యమునకు వ్యతిరేకముగా శత్రువుల సమూహమును పంపుట ద్వార ప్రదర్శించును. నిబంధనకు తగినట్లుగా జీవించని ఇశ్రాయేలీయుల మీద శిక్షగా **నిబంధనవిషయమై ప్రతిదండన చేయు ఖడ్గమును రప్పించును.**

స్పష్టముగా, శత్రువుల నుండి వచ్చు దాడి రక్షణ కొరకు ప్రజలు **పట్టణములలో** కూడుకొనునట్లు చేయును. అయితే, వారి పట్టణములు దేవుని ఉగ్రత నుండి వారిని తప్పించలేవు. బహిరంగ దేశములో వారిని, ఆపి దాడిచేయుటకు సైన్యమును పంపిన తరువాత, వారి దేశములలోనే వారిని చంపుటకు దేవుడు తెగులును పంపించును. తెగులు నుండి తప్పించుకొనుటకు, ప్రజలు పట్టణముల నుండి పారిపోతారు మరియు తమ శత్రువుల **చేతికి** అప్పగించబడుదురు.

**వచనము 26.** తన ప్రజలను మారుమనస్సులోకి నడుపుటకు ఖడ్గము మరియు తెగులుతో పాటుగా, ఈ శాపములతో దేవుడు తీవ్రమైన ఆకలిని కూడా పుట్టించెను. ఆయన [వారి] **ఆహారమును తీసివేయును.** "ఆహారము" అనగా అత్యంత సాధారణమైన ఆహారము, జీవించడానికి అవసరమైనది. ఆయన ఆహారమును కొరత చేస్తానని దేవుడు చెప్తున్నాడు. అది ఎంత కొరతగా ఉంటుందంటే **పదిమంది స్త్రీలు** (ప్రతి స్త్రీ ఒకొక్క కుటుంబమును సూచిస్తుంది) **ఒక్క పొయ్యిలోనే** వండుతారు. (సహజంగా

ప్రతి స్త్రీ తన కుటుంబము కొరకు వండుటకు తన సొంత పొయ్యి అవసరం.) వారు తూనికెచొప్పున ఆహారము మరల ఇచ్చెదరు (అక్షరార్థంగా "బరువు చొప్పున"), ఇది కొరతను సూచిస్తుంది. ప్రజలు తినడానికి ఉంటుంది గాని సరిపడినంత ఉండదు. కొరత ఎక్కువగా ఉంటుంది.

ఇశ్రాయేలీయులు ఆయనకు విధేయత చూపితే దేవుడు అభివృద్ధిని మరియు ఉత్పాదకతను ఇస్తానని వాగ్దానం చేసాడు. ఈ వచనములలో, ఆయన ప్రజలు అవిధేయులైతే యుద్ధముతో మరియు అనారోగ్యముతో మరియు ఆకలితో భూమిని శపించుదునని ఆయన వాగ్దానం చేసెను.

## 5. నశింపు, బహిష్కరణ మరియు నిర్జనము (26:27-33)

**27నేను ఈలాగు చేసినతరువాత మీరు నా మాట వినక నాకు విరోధముగా**
**నడిచినయెడల 28నేను కోపపడి మీకు విరోధముగా నడిచెదను. నేనే మీ పాపములను**
**బట్టి యేడంతలుగా మిమ్మును దండించెదను. 29మీరు మీ కుమారుల మాంసమును**
**తినెదరు, మీ కుమార్తెల మాంసమును తినెదరు. 30నేను మీ యున్నతస్థలములను**
**పాడు చేసెదను; మీ విగ్రహములను పడగొట్టెదను; మీ బొమ్మల పీనుగులమీద మీ**
**పీనుగులను పడవేయించెదను. 31నా మనస్సు మీయందు అసహ్యపడును, నేను మీ**
**పట్టణములను పాడు చేసెదను; మీ పరిశుద్ధస్థలములను పాడుచేసెదను; మీ**
**సువాసనగల వాటి సువాసనను ఆఘ్రా ణింపను. 32నేనే మీ దేశమును పాడుచేసిన**
**తరువాత దానిలో కాపురముండు మీ శత్రువులు దాని చూచి ఆశ్చర్యపడెదరు.**
**33జనములలోనికి మిమ్మును చెదరగొట్టి మీవెంట కత్తి దూసెదను, మీ దేశము**
**పాడైపోవును, మీ పట్టములు పాడుపడును.**

ఈ వాక్యభాగములో దేవుని పంపించు శాపములను గూర్చిన భాగము ముగింపులోకి వస్తుంది. మునుపు, దేవుడు ప్రజలను వ్యాధులతో, ఓటమితో, కరవుతో, అడవిమృగములతో, యుద్ధము, తెగులు మరియు ఆకలితో బాధించెను. ఈ వచనములలో, ఇశ్రాయేలీయులు అవిధేయతను కొనసాగిస్తే, రాజ్యము సమస్తమును కోల్పోయి చెరలోనికి తీసికొనిపోబడుతుంది అని చెప్పెను.

**వచనములు 27, 28.** ఇప్పటివరకు నిర్వహించబడిన శాపములు ఇశ్రాయేలీయుల మారుమనస్సుకు నడిపించకపోయినయెడల - దేవుని యెడల ఇశ్రాయేలీయులు ఇంకను **విరోధముగా** ఉండినయెడల - దేవుడు వారిని మరింత తీవ్రంగా బాధించును. ఆయన మరల ఆయన యొక్క ప్రజలను మరొక రకముగా బాధించెను. మునుపు ఆయన వారికి "విరోధముగా నడిచెను" (26:24); ఈ సందర్భంలో, ఆయన వారిని **కోపపడి విరోధముగా నడచును**. ఇతర వెర్షన్లు ఈ పదసమూహమును "అతికోపము" (KJV; NKJV; NRSV; NJB), "కోపములో" (NEB; REB), మరియు "మండుచున్న కోపముతో" (NAB) అని అనువదించబడింది మరోమాటల్లో, దేవుడు వారి తిరుగుబాటును చూచి కలతచెంది ఆయన ఉగ్రతను రప్పించును లేదా వారిమీద కోపపడును. దేవుని యొక్క కోపము

ఉగ్రతగా మారినప్పుడు, ఇశ్రాయేలీయుల మీద విపత్తు వస్తుంది. వారిమీద **ఏడంతలు దండన** అనేది విషాద ఫలితాలను కలిగిస్తుంది.

**వచనము 29.** రాజ్యములో కరవువస్తుంది. దాని తీవ్రత ఎంతగా ఉంటుందంటే వారికి తినడానికి ఏమియు ఉండదు, **కుమారుల మరియు కుమార్తెల మాంసమును** తినడానికి ఆవేశపడతారు (ద్వితీ. 28:52-57; 2 రాజులు 6:28, 29; యిర్మీ. 19:8, 9; విలాప. 2:20; 4:10; యెహే. 5:10 చూడండి).

**వచనము 30.** వారి **ఉన్నత స్థలములు** మరియు **పరిశుద్ధస్థలములు** నాశనమగుట దేవుడు చూచును. "ఉన్నతస్థలములు" అనేవి కనానీయులు విగ్రహారాధన కొరకు కొండమీద ఏర్పాటు చేసిన స్థలము. ఈ స్థలములను ఇశ్రాయేలీయులు స్వాధీనము చేసుకొని వారిమధ్య నివసించుచున్న అన్యుల దేవతలను ఆరాధించేవారు. "బలిపీఠములు" అనుమానం లేకుండ కనానీయుల దేవతలకు ధూపము వేయుటకు ఉపయోగించేవారు. అబద్ధ దేవతలను ఆరాధించుటకు ఉపయోగించబడిన ఉన్నతస్థలములను మరియు బలిపీఠములను దేవుడు నాశనము చేయును. అదియు గాక మరింత తీవ్రమైన దండన వారిమీదికి వచ్చును: ప్రజల పీనుగులను ("శవములను"; REB) నాశనము చేయబడిన విగ్రహముల మీద ఉంచెడివారు తద్వార బహుశా **విగ్రహములతో** పాటుగా అవి కూడా దహించబడేవి.[9] వారు దేవతలను ఆరాధించే స్థలము మాత్రమే నాశనము చేయబడుట కాదుగానీ, వారు కూడా చంపబడతారు. ఎందుకు? వారి పాపముల వలన దేవుడు వారిని విడిచిపెట్టును! వారి పాపమును ఆయన ద్వేషించును.

**వచనము 31.** [వారి] **పట్టణములను పాడుచేయుదునని** దేవుడు చెప్పాడు: వారి పట్టణములు నాశనము చేయబడును. అది జరుగునప్పుడు, వారి **పరిశుద్ధస్థలములు పాడుచేయబడును**. ఆరాధన కొరకు ఎవరు కూడ వారి పరిశుద్ధస్థలముల వద్దకు రారు; వారు విడిచిపెట్టబడుదురు. (ఈ "పరిశుద్ధస్థలములు" బహుశ మునుపటి వచనములోని "ఉన్నతస్థలముల"వలె మరియు "విగ్రహముల"వలె అబద్ధ దేవతలు ఆరాధించబడు స్థలము.) ఆ సమయములో దేవుని ప్రజలు ఆయన బలులు అర్పించాలని అనుకొన్నను సరే ఆయన వాటిని అంగీకరించనని చెప్పాడు. ఆయన **సువాసనగల వాటి సువాసనను ఆఘ్రా ణింపను** అని చెప్పాడు. దేవుడు వారి అర్పణలను అంగీకరించనంతకాలము, వారి పాపముల నుండి వారు క్షమించబడు మార్గం ఏమియు ఉండదు.

**వచనము 32.** దేవుడు **దేశమును పాడుచేయును**. ఇక్కడ ఆలోచన ఏమిటంటే దేశము విడిచిపెట్టబడుతుంది; కాని, దానికంటే ఎక్కువగా, దానిలో ఉత్పాదకత ఉండదు మరియు ఆకర్షణీయంగా ఉండదు. ఈ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందంటే దేవుని ప్రజలు పంపివేయబడిన తరువాత **దానిలో కాపురముండు శత్రువులు** దాని చూచి **ఆశ్చర్యపడతారు**. ఇశ్రాయేలీయుల పాపములను బట్టి వచ్చు ఒక భయంకరమైన ఫలితమేమిటంటే "పాలు తేనెలు" ప్రవహించు దేశము దాని నివాసులకు అశుద్ధమైనదిగాను మరియు వారి విసుకుగాను తయారవుతుంది.

ఈ విషాదమును గూర్చి రెండు సత్యములు చెప్పుకోదగినవి: (1) ఇశ్రాయేలీయుల శత్రువులు వారి దేశములో స్థిరపడుదురు. తరువాత వచనము స్పష్టపరచునట్లుగా,

ఇశ్రాయేలీయులు ఆ దేశము నుండి చెదరిపోతారు, (2) పాడుచేస్తానని చెప్పబడిన ఈ దేశమేదనగా దేవుడు అబ్రాహామును వాగ్దానము చేసి ఇశ్రాయేలీయులకు ఇవ్వబోయే దేశము. అది త్వరలో యెహోషువ చేత స్వాధీనము చేసుకొనబడి పెండ్రెండు గోత్రములు స్థిరపరచబడు దేశము. అది ఇశ్రాయేలీయుల దేశము, కాని వారికి ఇచ్చుచున్న దేవునిపై వారు తిరుగుబాటు చేసినయెడల ఒకరోజు వారూ దానిని కోల్పోతారు.

**వచనము 33.** దేవుని యొక్క కడవరి ఉగ్రత ఏమనగా ఇశ్రాయేలీయులను **జనములలోనికి చెదరగొట్టడం.** వారు **కత్తి ద్వార** దేశము నుండి చెదరగొట్టబడుదురు. వారు వెళ్లిపోయినప్పుడు, దేశము **పాడైపోతుంది** మరియు **పట్టణములు పాడైపోతాయి.** అనగా, రాజ్యము ఇక ఉండదు. ప్రజలు అంతయు కోల్పోతారు! దేవుని ఆజ్ఞలు పాటించక పశాత్తాపము లేని ఇశ్రాయేలీయుల నిరంత తిరుగుబాటు ఫలితంగా ఇది వచ్చినది దేవుడు చెప్పాడు. దేవుని చిత్తమునకు విరుద్ధంగా ఉండడం నాశనమునకు నడిపిస్తుంది.

## చివరి శిక్ష: చెర మరియు పాడుచేయబడడం (26:34-39)

**[34]మీరు మీ శత్రువుల దేశములో ఉండగా మీ దేశము పాడైయున్న దినము లన్నియు అది తన విశ్రాంతికాలములను అనుభవించును. [35]అది పాడైయుండు దినములన్నియు అది విశ్రమించును. మీరు దానిలో నివసించినప్పుడు అది విశ్రాంతికాలములో పొందకపోయిన విశ్రాంతిని అది పాడైయుండు దినములలో అనుభవించును. [36]మీలో మిగిలినవారు తమ శత్రువుల దేశములలో ఉండగా వారి హృదయములలో అధైర్యము పుట్టించెదను; కొట్టుకొని పోవుచున్న ఆకు చప్పుడు వారిని తరుమును, ఖడ్గము ఎదుటనుండి పారిపోవునట్లు వారు ఆ చప్పుడు విని పారిపోయెదరు; తరుమువాడు లేకయే పడెదరు. [37]తరుమువాడు లేకయే వారు ఖడ్గమును చూచినట్టుగా ఒకనిమీద నొకడు పడెదరు; మీ శత్రువులయెదుట మీరు నిలువలేక పోయెదరు. [38]మీరు జనముగానుండక నశించెదరు. మీ శత్రువుల దేశము మిమ్మును తినివేయును. [39]మీలో మిగిలినవారు మీ శత్రువుల దేశములలో తమ దోషములనుబట్టి క్షీణించిపోయెదరు.**

ఐదు ప్రమాదకరమైన శాపములను అనుసరించి, ఇశ్రాయేలీయులు "చెదరుట" మరియు "పాడుచేయబడుట" అను పర్యవసానములను గూర్చి దేవుడు వివరించెను.

**వచనములు 34, 35.** ప్రజల మీద దేవుని యొక్క శిక్షా ఫలితముగా, పాడైపోయిన **దేశము** అనుకూలమైన పర్యావసానమును అనుభవిస్తుంది: **మీ దేశము పాడైయున్న దినములన్నియు తన విశ్రాంతికాలమును అనుభవించును.** "అనుభవించును" అను పదము హెబ్రీ పదమైన רָצָה (*రట్సాహ*), నుండి వస్తుంది అనగా అక్షరార్థంగా "సంతృప్తి చెందుట" అని అర్థము.

దేవుడు ఇశ్రాయేలీయుల భవిష్యత్తును చూస్తున్నాడు. ఇక్కడ అర్థమేదనగా, ఈ సమయానికి, ఆయన ప్రజలు వాగ్దాన దేశములో నివసించియుండాలి కాని

సాగుచేయకుండా విశ్రాంతి తీసుకోవడానికి అనుమతించబడినప్పుడు విశ్రాంతి దినమును మరియు విశ్రాంతి సంవత్సరమును **ఆచరించలేదు**. ప్రజలు ఒకసారి దేశము నుండి బహిష్కరించబడితే, దానికి చెందవలసిన విశ్రాంతిని అది అనుభవిస్తుంది. దేవుడు భూమికి విశ్రాంతిని ఆజ్ఞాపించాడు, మరియు నిరంతరం అవిధేయతతో ప్రజలు దానిలో నివసిస్తే ఏమి జరుగుతుందో ఆయన వివరించాడు.

**వచనములు 36, 37.** పాడైపోయిన దేశము ఒకదినమున విశ్రాంతిని అనుభవిస్తుంది, చెదరిపోయిన ప్రజలు తమ తాము చెదరుటను ఆనందంగా అనుభవించలేరు. వారికి బలహీనత, భయము మరియు అసమర్థత అను తెగులు చేత బాధించబడతారు. **వారి హృదయములలోని అధైర్యము** ప్రతిదాని యెడల అది భయమును పుట్టిస్తుంది! **కొట్టుకొనిపోవుచున ఆకు చప్పుడు** వారు పారిపోవునట్లు చేస్తుంది. శత్రువులు ఉన్నారని వారు మాత్రమే కేవలము ఊహించిన వారు తరుమకపోయినను వారు **పారిపోయెదరు.** వారి మనస్సులో ఉన్నటువంటి దయ్యముల ద్వార వారు పారిపోవుచున్నప్పుడు, వారు ఒకనిమీద నొకడు పడునంత అసమర్థంగా ఉంటారు. చెదరియున్న దేవుని ప్రజలు చాల బలహీనంగా ఉంటారు నిజమైన **శత్రువులు** వారిపై దాడిచేసినను, వారు వారి యెదుట **నిలువబడలేరు**.

**వచనములు 38, 39.** వచనము 38లో, ఆయన ఆజ్ఞను ధిక్కరించుట వలన చెదరిపోయిన ఇశ్రాయేలీయుల చివరి పర్యవసానమును దేవుడు వివరించాడు: వారు **జనముగా నుండక నశించుదురు**; మరియు వారి **శత్రువుల దేశము** వారిని **మ్రింగివేయును.** పాడైపోయిన దేశములలో వారు చనిపోతారు.

మరింత స్పష్టమైన భాషలో శిక్షను గూర్చి దేవుడు వచనము 39లో వివరించెను. **మిగిలినవారు** అను మాట "శత్రువుల దేశములో" చెదరిపోవు నాశనమును తప్పించుకొను కొద్దిమందిని సూచిస్తుంది. వారికి ఏమి జరుగుతుంది? వారు చనిపోతారని వచనము చెప్తుంది; కాని వారి మరణములో, వారు **క్షీణించిపోతారని** వివరిస్తుంది. దేశము యొక్క గడువు క్రమముగా మరియు భయకంరమైనదిగా ఉంటుంది.

దేవుడు మరల ఈ విధముగా చెప్పాడు, ఈ మరణము సంభవించినప్పుడు, అది ప్రజల **దోషములను బట్టి** లేదా పాపమును బట్టి వస్తుంది. అయితే, **తమ తల్లిదండ్రుల దోషములను** బట్టి వారు శిక్షించబడతారని కూడా చెప్పాడు. దేశము శిక్షించబడినదని, చెదరిపోయి చెరలో నశించిపోయినదని ఇశ్రాయేలీయులు పాపము చేసి మారుమనస్సు పొందుటకు ధిక్కరిస్తే, దాని యొక్క చివరి నాశనము వారి యొక్క ఒక్క తరము పాపమును బట్టి మాత్రమే కాదు. అవిధేయులైన ఇశ్రాయేలీయుల తరముల నిరంతర పాపములను పరిణామములు ఇవే.

## మారుమనస్సు పొందు అవకాశం (26:40-43)

**40వారు నాకు విరోధముగా చేసిన తిరుగుబాటును తమ దోషమును తమ తండ్రుల దోషమును ఒప్పుకొని, తాము నాకు విరోధముగా నడిచితిమనియు 41నేను తమకు విరోధముగా నడిచితిననియు, తమ శత్రువుల దేశములోనికి తమ్మును**

**రప్పించితిననియు, ఒప్పుకొనినయెడల, అనగా లోబడని తమ హృదయములు లొంగి తాము చేసిన దోషమునకు ప్రతిదండనను అనుభవించితిమని ఒప్పుకొనినయెడల, [42]నేను యాకోబుతో చేసిన నా నిబంధనను జ్ఞాపకము చేసి కొందును; నేను ఇస్సాకుతో చేసిన నా నిబంధనను నేను అబ్రాహాముతో చేసిన నా నిబంధనను జ్ఞాపకము చేసికొందును; ఆ దేశమునుకూడ జ్ఞాపకము చేసికొందును. [43]వారిచేత విడువబడి వారు లేనప్పుడు పాడైపోయిన వారి దేశమును తన విశ్రాంతిదినములను అనుభవించును. వారు నా తీర్పులను తిరస్కరించి నా కట్టడలను అసహ్యించుకొనిరి. ఆ హేతువుచేతనే వారు తమ దోషశిక్ష న్యాయ మని ఒప్పుకొందురు.**

ఈ వాక్యభాగములు చెప్పబడిన భయంకరమైన శాపములు, ఇశ్రాయేలీయులు తరచు శిక్షించబడిన పిమ్మట మారుమనస్సు పొందే అవకాశం ఉన్నదని చెప్పబడిన దేవుని ప్రకటనతో హఠాత్తుగా తొలగించబడ్డాయి.

**వచనములు 40, 41.** ఇప్పటి వరకు అధ్యాయమును చదివినవారు మతభ్రష్టులైన ఇశ్రాయేలీయులకు నిరీక్షణ లేదని చెప్పి ముగించవచ్చు, కాని మారుమనస్సు పొందడానికి ఇశ్రాయేలీయులు ఏమి చేయాలో దేవుడు చెప్పాడు. దేవుని ప్రజలు అవిధేయులుగా ఉన్నను, దేవుడు వారిని భయంకరమైన శాపములతో పదే పదే కొట్టినను, మారుమనస్సు పొందడానికి వారికి మరొక అవకాశం ఉంటుందని వారు నేర్చుకొనినప్పుడు ప్రతి ఇశ్రాయేలీయుడు ఖచ్చితంగా భరోసా పొందేవాడు.

మారుమనస్సు పొందు అవకాశము, తప్పుచేయడం వలన దేవుడు దేశము శిక్షిస్తాడను వాస్తవమును మాత్రమే తెలియజేయడం కాదు కానీ; వారు మారుమనస్సు పొందుటకు తద్వారా వారు దీవించబడుటకు కూడా ఉద్దేశించబడినవి. ఈ వాక్యభాగములో, ఇశ్రాయేలీయులు ఆయనవైపు చూపించిన "విరోధమును" బట్టి వారికి "విరోధముగా" ఉండుటకు ఆయనను రేకెత్తించే సమయమును దేవుడు చూస్తున్నాడు. వారు తమ శత్రువుల దేశములోనికి తీసుకొనిపోబడినను, వారు మారుమానస్సు పొందితే దీవిస్తానని దేవుడు చెప్తున్నాడు.

ఇశ్రాయేలీయులు మారుమనస్సు పొందడానికి వారు ఏమి చేయాలని దేవుడు కోరెను?

మొదట, **వారు తమ దోషమును తమ తండ్రుల దోషమును ఒప్పుకొనాలి.** ప్రజలుగా, వారు రక్తము మరియు నమ్మకము అను బంధకాలలో బంధించబడ్డారు - పండ్రెండు గోత్రములలోనే కాదుగానీ ఒక తరము నుండి మరొక తరమువరకు చరిత్ర అంతయు కూడ. అందువలన, ప్రస్తుత తరమువారు దేశము యొక్క ప్రస్తుత మరియు గత పాపములను ఒప్పుకొనాలని చెప్పబడింది. వారి పాపములు ఏవనగా **దోషము**, అవిశ్వాసము, మరియు దేవునికి **విరోధముగా** ఉండుట. దేవుడు వారికి **విరోధముగా** ఉండడానికి గల కారణము వారి పాపములే మరియు ఫలితముగా శాపములను ఆయన ఇచ్చెను.

రెండవదిగా, **లోబడని తమ హృదయములను** [లేదా "అన్య"] **లొంగజేయాలి.** హృదయములను లొంగజేయాలంటే పశ్చాత్తాపంతో దేవుని ముందు వంగి, వారి దోషమును ఒప్పుకొని ఆయన యొక్క గొప్పదనమును మరియు పరిశుద్ధతను

ఒప్పుకోవాలి. అనగా వారి దుష్ట క్రియలను బట్టి వారు సాకులు చెప్పక, కనికరము కొరకు దేవునిని బ్రతిమాలుకోవడం.

మూడవదిగా, వారు చేసిన తప్పు కార్యములను బట్టి వారు **పరిహారం** చెల్లించాలి. వారు చేసిన తప్పుచేసిన దానిని బట్టి పరిహారం చేయవలసి ఉంటుంది. ఈ సందర్భంలో, పరిహారం చెల్లించడమంటే, శత్రువుల నుండి శిక్షను అనుభవించడం మరియు రాజ్యముల మధ్య చెదరిన ప్రజల వలె జీవించడం.[10]

**వచనములు 42, 43.** ఇశ్రాయేలీయులు తమ పాపములను ఒప్పుకొని పశ్చాత్తాపపడితే, వారు దేవుని యెదుట విధేయులుగా ఉంటె మరియు పరిహారం పొందితే, వారు ఆశీర్వదించబడతారు అనగా ఆయన వారితో చేసిన [ఆయన] **నిబంధనను జ్ఞాపకము చేసుకొనును.** దేవుడు "జ్ఞాపకము" చేసుకొనుట అనగా ఆయన నిబంధనను మర్చిపోయాడు అని కాదు. ఆయన ముందు చేసిన విధముగా నిబంధనను బట్టి మరల ఆయన కార్యము చేస్తాడు. మాటలు యేమని చెప్తాయంటే ఇశ్రాయేలీయులు తమ తిరుగుబాటును కొనసాగించుచున్నప్పుడు అవి ప్రక్కన పెట్టబడెనని సూచిస్తాయి. ఇశ్రాయేలీయులు తిరుగుబాటు మానివేసి మారుమనస్సు పొందితే, దేవుడు నిబంధన ఆశీర్వాదములను పునరుద్ధరించి కార్యము చేస్తాడు.

ఆయన పునరుద్ధరించే నిబంధన ఆయన **యాకోబు, ఇస్సాకు** మరియు **అబ్రాహాముతో** చేసిన నిబంధనయే అని దేవుడు చెప్పినమాటలు యేమని సుచిస్తాయంటే సీనాయి నిబంధన మునుపు నిబంధనల వలె కొనసాగింపబడే నిబంధన. ఈ అధ్యాయములో దేవుడు చెప్పినటువంటి ఆశీర్వాదము ఏమనగా అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబులకు వాగ్దానము చేయబడి ఇశ్రాయేలీయులు కనానును జయించిన తరువాత నెరవేర్చబడే వాగ్దాన దేశము. **దేశమును జ్ఞాపకము చేసుకొందును** అని దేవుడు చెప్పినప్పుడు, "దేశమును గూర్చిన నా నిబంధనను నేను జ్ఞాపకము చేసుకొంటానని"; మరియు చెదరిపోయిన వారిని తిరిగి రప్పిస్తానని ఆయన తెలియజేస్తున్నాడు.

ఇంతలో, పునరుద్ధరణ సమయము వరకు, **భూమి పాడైపోతుంది** ప్రజలు విశ్రాంతి దినమును పాటించని సమయములో ఇశ్రాయేలీయుల భ్రష్టత్వమును బట్టి అనుభవించలేని **విశ్రాంతి**ని అది అనుభవిస్తుంది. ఈ శిక్ష కాలంలో, ప్రజలు చెదరిపోయి భూమి పాడైపోయినప్పుడు, దేవుని నియమములను తిరస్కరించి దేవుడు వారిని విడిచిపెట్టునట్లు చేసిన వారి **దోష శిక్షన్యాయమును ఒప్పుకొందురు.** స్పష్టంగా, దేవుని శాపములను అనుభవించుట అనేది ప్రజలు తాము చేసిన దోషములను బట్టి పరిహారం చెల్లించడమే.

## ఆయన ప్రజలను తిరస్కరించనను దేవుని వాగ్దానము (26:44, 45)

**44 అయితే వారు తమ శత్రువుల దేశములో ఉన్నప్పుడు వారిని నిరాకరింపను; నా నిబంధనను భంగపరచి వారిని కేవలము నశింపజేయునట్లు వారి యందు అసహ్యపడను. ఏలయనగా నేను వారి దేవుడనైన యెహోవాను. 45 నేను వారికి దేవుడనైయుండునట్లు వారి పూర్వికులను జనములయెదుట ఐగుప్తులోనుండి రప్పించి**

**వారితో చేసిన నిబంధనను ఆ పూర్వికులనుబట్టి జ్ఞాపకము చేసికొందును. నేను యెహోవాను అని చెప్పుము అనెను.**

**వచనములు 44, 45.** ఆశీర్వాదములను మరియు శాపములను గూర్చిన ఆయన సందేశము ఆయన ముగిస్తుండగా, ఆయన వారిని విడువననే అద్భుతమైన హామీతో దేవుడు వారిని వదలివెళ్లెను. **అయితే** అను మాట స్పష్టముగా శత్రువుల దేశములలో ఆయన ప్రజలను దేవుడు చెదరగొట్టెనను విషయమును తెలియజేస్తుంది. ఇశ్రాయేలీయుల నిరంతర అవిధేయతను బట్టి దేవుడు ఇశ్రాయేలీయులను తమ శత్రువుల చేతికి అప్పగించి వారిని తీసుకొనిపోయేట్లు చేసినను, వారు ఆయన సొంతం అని చెప్తున్నాడు.[11]

వారు **తమ శత్రువుల దేశములో ఉన్నప్పుడు**, ఆయన **వారిని నిరాకరింపనని** వారిని కేవలము **నశింపజేయనని** చెప్తూ దేవుడు ఈ మాటను ఒత్తి చెప్పెను. ఆయనపై తిరుగుబాటు చేయు ప్రజలతో అయన ఎందుకు తమ నిబంధనను కొనసాగించును? **నిబంధనను బట్టి! ఐగుప్తు** నుండి ఇశ్రాయేలీయులను (**వారి పితరులను**[12]) దేవుడు విమోచించినప్పుడు ఆయన వారితో నిబంధన చేసెను. వారు నిబంధనను బట్టి నిలిచారో లేదోగాని, ఆయన మాత్రం నిబంధనను గౌరవిస్తానని చెప్పాడు. ఆయన మాట నెరవేర్చడమంటే ఏది జరిగినను సరే దేవుడు ఇశ్రాయేలీయులను తన ప్రత్యేకమైన ప్రజలుగా నిలువబెట్టును. దేవుడు తన ప్రజలను ఐగుప్తు నుండి విమోచించి వారితో నిబంధన చేసెను; వారు ఆయన ప్రజలైరి, మరియు ఇశ్రాయేలీయులు దేశములలో చెదరినప్పటికీ నిబంధన గట్టిగానే కొనసాగుతుంది.

ఈ సత్యము సత్యమును నిర్వచించు వాని చేత ధృవీకరించబడింది: **దేవుడు. నేను దేవుడైన యెహోవాను** అను మాటను ఆయన ముగించెను.

## చివరి మాటలు (26:46)

**46యెహోవా మోషేద్వారా సీనాయికొండమీద తనకును ఇశ్రాయేలీయులకును మధ్య నియమించిన కట్టడలును తీర్పులును ఆజ్ఞలును ఇవే.**

**వచనము 46.** ముందుగా ఉన్నటువంటి 26 అధ్యాయములన్నిటిలో ఉన్న ప్రత్యక్షతను ఈ వాక్యభాగము సంగ్రంగా చెప్తుంది. ఆ అధ్యాయములేవనగా (1) **విధులు, కట్టడలు మరియు నియమములు**, (2) అవి **దేవుడిచ్చినవి**, (3) మరియు అవి **ఇశ్రాయేలీయులకు**, (4) మానవుడైన **మోషే** ద్వార, (5) ప్రత్యక్షత కలిగిన **సీనాయి పర్వతము వద్ద** ఇవ్వబడెను. వచనము 46 పుస్తకమంతటికీ ముగింపు గాల పనిచేస్తుంది.[14] R. Laird Harris ఇలా వ్రాసెను, “శిబిరాలు విచ్ఛిన్నం చేయబడి మరియు కనాను దేశములో వెళ్లడానికి ముందుగా ప్రతిజ్ఞలో కొన్ని అదనపు విషయాలు ఇవ్వబడినప్పటికీ ఈ వచనము నిజముగానే లేవీయకాండము యొక్క సారంశముగా చెప్పబడింది.”[15]

చివరి వచనము ప్రాముఖ్యము ఎందుకనగా ధర్మశాస్త్రము మానవుని నుండి కాక దేవుని నుండి వచ్చినదని అది ఒత్తి చెప్తుంది. అది దేవుని సేవకుడైన మోషే ద్వార

ఇవ్వబడింది. లిబరల్ పండితుల ఆలోచనకు వ్యతిరేకముగా, అది కొన్ని వందల సంవత్సరాల శోధనానుభావములు, చేర్పులు, లోపాలు మరియు పేరులు చెప్పబడని, ప్రేరణలేని ప్రజల వలన పునర్విమర్శల ఫలితము కాదు. ఒకరు బైబిలును నమ్మితే, మిగతా పంచగ్రంథములలోని నియమములవలె లేవీయకాండములోని నియమములు కూడా దేవుని మనసు నుండి ఆవిర్భవించి మోషే ద్వార ఇశ్రాయేలీయులకు ఇవ్వబడెనని నమ్మాలి.

## అధ్యాయము 26లో ఆశీర్వాదముల వాగ్దానములు మరియు శాపములు

ఈ వాగ్దానములు లేదా ముందుగా చెప్పడం, ఆశీర్వాదములు మరియు శాపములు మోషే ద్వార సీనాయి పర్వతము వద్ద ఇవ్వబడినవి. అవి నెరవేర్చబడినవా? నెరవేరితే, ఎప్పుడు, ఎక్కడ?

*అవి ఎలా నెరవేర్చబడెను.* పాత నిబంధన గ్రంథము చరిత్ర తెలిసిన అధ్యాయము 26 యొక్క ఏ పాఠకుడైన ఆయన ప్రవచనము చదివినంత భావన వస్తుంది - ముందుగానే వ్రాసిన చరిత్ర. వెయ్యి సంవత్సరముల కాలములో విధేయత చూపినప్పుడు దేవుడు ఇశ్రాయేలీయులను దీవించి అవిధేయతగా ఉన్నప్పుడు నాశనం చేసాడు అని బైబిల్ నమోదు చేస్తుంది. కొన్ని ఉదాహరణలు చూద్దాము.

వారి ఎడారి ప్రయాణము అయ్యిపోకముందు, అవిధేయతను గూర్చి వారి శిక్షించి లేదా శపించినప్పుడు దేవుని యొక్క విచారమును ఇశ్రాయేలీయులు అనుభవిస్తారు. వాస్తవానికి, ఐగుప్తు నుండి వచ్చిన చాలామంది వారు చేసిన పాపము వలన ఎడారిలో చనిపోతారు.

న్యాయాధిపతులలో, ప్రజలు దేవుని నుండి మరలి విగ్రహాలవైపు తిరుగుతారు మరియు దేవుడు వారిని నాశనము చేయడానికి మరొక రాజ్యమును తెస్తాడు. అప్పుడు వారు మారుమనస్సు పొందుతారు, దేవుడు వారిని విమోచించి వారిని మరల ఆశీర్వదించును.

ఇశ్రాయేలీయుల రాజులను గూర్చి చెప్పబడిన పుస్తకములలో, రాజులు (రాజ్యము) నీతిగా ఉన్నప్పుడు దేవుడు వారిని ఆశీర్వదించెనని రాజులు దుర్నీతిపరులుగా ఉన్నప్పుడు వారిని శపించెనని రచయితలు వ్రాసారు. (రాజ్యము విభజించబడిన తరువాత, ఎక్కువ శాతము వారు దుర్నీతిపరులు.)

శాపముల యొక్క చివరి నెరవేర్పు ఎప్పుడు వచ్చినదంటే ఇశ్రాయేలీయుల మతభ్రష్టత వలన చెరలోనికి ప్రజలను దేవుడు కోపముతో పంపించినప్పుడు. మొదట, ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలును అష్షూరీయులు నాశనము చేసారు; రెండవదిగా, దక్షిణ రాజ్యమైన యూదా దేశమును చెరగొనిపోయారు.

బబులోనుకు చెరగొనిపోయిన వారిని ఆయన విడిచిపెట్టలేదు. ఆయన చివరికి శేషులైన వారిని వాగ్దాన దేశములోనికి తీసుకొచ్చి వారితో మరోసారి నిబంధనను నిలబెట్టెను (ఎజ్రా మరియు నెహెమ్యా చూడండి). ఇవన్నియు కూడా లేవీయకాండము 26లో ఇవ్వబడిన ఆశీర్వాదములలో మరియు శాపములలో ముందుగానే కనిపిస్తుంది.

*అవి ఎలా నెరవేర్చబడలేదు.* అధ్యాయములో ఇయ్యబడిన ఆశీర్వాదములు మరియు శాపములు ఇశ్రాయేలు రాజ్యమంతటికె తప్ప రాజ్యములో ఉన్న ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా కాదు. ప్రజలు దేవుని ఆజ్ఞను గైకొంటే రాజ్యము వృద్ధిచెందుతుందని దేవుడు వాగ్దానం చేసాడు; ధర్మశాస్త్రమును అనుసరించినట్లైతే వ్యక్తిగతంగా దీవిస్తానని చెప్పలేదు దేవుడు.

నీతిమంతులు ఎల్లప్పుడు ఆశీర్వదించబడలేదని మరియు కొన్నిసార్లు దుర్నీతిపరులు ఆశీర్వదించబడ్డారని పాత నిబంధన గ్రంథము స్పష్టం చేస్తుంది. ఉదాహరణకు, నీతి అనేది ఎల్లప్పుడు సంపదను తెస్తుందని మరియు బాధ ఎల్లప్పుడు పాపమును తెస్తుందనిన అపార్థమును యోబు అనుభవము సరిచేస్తుంది. కీర్తనల గ్రంథము యొక్క రచయిత తరచు ఫిర్యాదు చేసేదేంటంటే వారు నీతిగా ఉన్నను బాధలను అనుభవించారు, అదే సమయములో దుర్నీతి పరులు వృద్ధిపొందుతున్నారు. మంచివారు కొన్నిసార్లు చెడ్డ వారిచేత చంపబడుచున్నారు (నాబోతు చంపబడుట ద్వార ఆహాబు ద్రాక్షతోటను సొంత చేసుకొంటాను అనుకొనినలాగున). తదుపరి, పాత నిబంధన గ్రంథములో హతసాక్షులు ఉన్నారు. దేవునికి నమ్మకస్తులముగా ఉండుట వలన సంపద వస్తుందనిన ఆలోచన ఒక హతసాక్షి మరణము ద్వార తిరస్కరించబడుతుంది!

దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన పాత నిబంధనను ఒకరు అర్థం చేసుకోవాలంటే, దాని ఆశీర్వాదములు మరియు శాపములు దేశమునకు వర్తిస్తవి కాని వ్యక్తిగతంగా కాదని అర్థం చేసుకోవాలి. అవి రాజ్యమునకు సంబంధించినవి గాని వ్యక్తిగతమైన ఆశీర్వాదములు కాదు.

## అన్వయము

### "ఆశీర్వాదములు మరియు శాపములు,"

### మరియు "ఆరోగ్యమైన మరియు సంపదయైన" సువార్త (అధ్యా. 26)

నేడు కొంతమంది ప్రసంగీకులు "ఆరోగ్య మరియు సంపద" సువార్తను ప్రకటించుచున్నారు. వారి సందేశమేదనగా దేవుడు తన ప్రజలు శారీరకంగా మరియు ఆర్థికంగా మంచిగా ఉండాలని కోరుకుంటున్నాడు. క్రైస్తవులు దేవుడు అడుగుజాడల్లో నడచినట్లైతే, వారు ఎన్నడును అనారోగ్యమునకు గురి కాకుండా అభివృద్ధి చెందుతారనిన నిశ్చయతను ఆయన ఇస్తాడని వారు నొక్కి చెప్తుంటారు.

ఈ సిద్ధాంతమును రుజువు పరచుటకు, ఈ ప్రసంగికులు తరచుగా పాతనిబంధన గ్రంథములోని, అబ్రాహాము వాగ్దానములను మరియు లేవీయకాండము 26లోని వాక్యభాగములు లాంటివి క్రైస్తవులకు వర్తిస్తాయని చెప్తుంటారు. ఈ విధముగా చేయుటద్వార, వారు అనేక సత్యాలను పట్టించుకోరు. వాస్తవానికి అబ్రాహాము సంపన్నుడే, కాని దేవుని విమోచన ప్రణాళికలో ఒక ప్రత్యేకమైన పాత్రవహించు ప్రత్యేక వ్యక్తిగా ఉన్నాడు. దేవుని ప్రణాళికలో అబ్రాహాముకు ఉన్నటువంటి స్థానమును ఎవరు

పొందుకోలేరు; గనుక, అబ్రాహాముకు చేయబడిన వాగ్దానములను ఖచ్చితముగా పొందుకోగలననిన నిశ్చయతను ఎవరు కలిగియుండలేరు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన వాగ్దానములు దేశమునకు చెందినవే తప్ప వ్యక్తిగతంగా కాదు. దేవుని ప్రజలలో ఉన్నటువంటి నీతిమంతులు బీదవారే. క్రైస్తవులు పాత నిబంధన నియంత్రణలో ఇక లేరు గనుక, పాత నిబంధన బోధలు నేటి క్రైస్తవులకు నేరుగా (ప్రత్యక్షంగా) వర్తించదు.

దేవుడు ఎల్లప్పుడు విశ్వాసులైన క్రైస్తవులను ఆరోగ్యము మరియు సంపదతో ఆశీర్వదిస్తాడని కొంతమంది తప్పుడు బోధకులు లూకా 6:38 వంటి క్రొత్త నిబంధన వాక్యములను ఎత్తి చూపుతూ నిరూపిస్తారు. ఆ నివేదనలో సమస్యలు ఉన్నాయి. అనేకమంది క్రైస్తవులు హతసాక్షులైరి (ఉదాహరణకు, స్తెఫను). హతసాక్షుల యొక్క సూత్రము "ఆరోగ్యము మరియు సంపద" సువార్తకు అనుకూలంగా లేదు. క్రొత్త నిబంధన గ్రంథములో కొంతమంది క్రైస్తవులు ధనికులే (1 తిమోతి 6:17) కాని చాలామంది ధనికులు కారు (1 కొరింథీ. 1:26). "ఆరోగ్య మరియు సంపద" సువార్త వాస్తవమైతే, క్రైస్తవులందరు కూడా ధనికులుగా ఉండేవారు. తదుపరి, క్రొత్త నిబంధన గ్రంథములో క్రైస్తవులు అనారోగ్యపాలైరి మరియు వారు ఎల్లప్పుడు ప్రభువు చేత స్వస్థపడలేదు (2 కొరింథీ. 12:7-10; 1 తిమోతి 5:23; 2 తిమోతి 4:20). "ఆరోగ్య మరియు సంపద" సువార్త వాస్తవమైతే, ఆ వాస్తవం ఏ విధముగా వివరించబడుతుంది?

శారీరక ఆశీర్వాదములను గూర్చి క్రొత్త నిబంధన గ్రంథము యేమని చెప్తుంది? శారీరక ఆశీర్వాదములను గూర్చి కేవలము రెండే రెండు వాగ్దానములు క్రొత్త నిబంధన గ్రంథములో ఇవ్వబడెను. (1) మొదట ఆయన రాజ్యమును వెదకినయెడల (మత్తయి 6:33) దేవుడు మన శారీరక అవసరములను (ఆయన నిర్వచించిన విధముగా) తీర్చుదునని వాగ్దానము చేసెను. (2) మనము నీతిగా జీవిస్తే, హింసించబడతామని ఆయన వాగ్దానం చేసెను (2 తిమోతి 3:12). "ఆరోగ్య మరియు సంపద" సువార్త తప్పు అని ప్రకటిస్తూ ముగించాలి. లూకా 6:38వంటి వాక్యములలో క్రైస్తవులకు వాగ్దానము చేయబడిన ఆశీర్వాదములు భౌతికమైనవి లేదా శారీరకమైనవి కాదు, అవి ఆత్మీయమైనవి.

క్రొత్త నిబంధన యొక్క ఆశీర్వాదములు మరియు శాపములు ఏవి? దేవునికి విధేయత చూపినవారు అందరిలో మెండైన ఆశీర్వాదములను పొందుకొంటారు; వారు రక్షించబడతారు (హెబ్రీ. 5:8, 9). మరోప్రక్క, అవిధేయులు నశించబడతారు (2 థెస్స. 1:8, 9). మత్తయి సువార్తలో ఆశీర్వాదములను మరియు తీవ్రమైన నాశనమును గూర్చి యేసు చిత్రీకరించారు. అక్కడ ఆయన ఏమి చెప్పారంటే, తీర్పు దినమందు, ఇతరులకు సహాయము చేయుటలో విఫలమైనవారు భయంకరమైన మాటలను వింటారు "శపింపబడినవారలారా, నన్ను విడిచి నిత్యాగ్నిలోనికి పోవుడి" (మత్తయి 25:41). ఇతరులకు మేలు చేసినవారు ఆహ్వానకరమైన మాటలను ఆలకింతురు "తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" (మత్తయి 25:34). చివరి మహాగొప్ప దినమున ప్రతిఒక్కడు "శపింపబడినవారలారా, విడిచిపొమ్ము . . . అనిగాని" లేదా

"ఆశీర్వదింపబడినవారలారా, రండి . . ." అనిగాని విినప్పుడు క్రొత్త నిబంధన యొక్క అంతిమ ఆశీర్వాదములు మరియు శాపములు ప్రకటించబడతాయి.నీకొరకు నాకొరకు ఏది? (ఆశీర్వాదమా? లేదా శాపమా?)

## దేవుడు ఇశ్రాయేలీయులను పూర్తిగా ఎందుకు తిరస్కరించలేదు?

## (26:44, 45)

ఇశ్రాయేలీయులు నిరంతరం తిరస్కరించుట ద్వార చేరలోనికి కొనిపోబడు శిక్షను పొందుదురని తెలిసికూడా ఆయన పరిపూర్ణంగా వారిని తిరస్కరించను లేదా నాశనము చేయనని దేవుడు ఎందుకు చెప్పాడు? ఈ వాక్యభాగములో ఇవ్వబడిన సమాధానమేదనగా ఆయన వారితో నిబంధన చేసుకొనెను! దేవుడు ఇశ్రాయేలీయులతో తాను చేసిన నిబంధను కాపాడుకొనుటలో ఎందుకు శ్రద్ధ చూపెను?

ఇశ్రాయేలీయుల యెడల ఆయనకున్న గొప్ప ప్రేమద్వార నిబంధనను కాపాడుకొనాలని దేవుడు నిర్ణయించుకొన్నాడని మనము ఆలోచనచేస్తే అది తప్పు. రాజ్యములన్నిటికి ఆశీర్వాదముగా ఉండాలని దేవుడు అబ్రాహాముతో నిబంధన చేసెను (ఆది. 12:3). లోకమంతటికీ ఆయన ప్రేమను కనుపరచు మధ్యవర్తులుగా "యాజక సమూహముగా" ఉండాలని దేవుడు సీనాయి పర్వతము యొద్ద ఇశ్రాయేలీయులతో నిబంధన చేసెను (నిర్గమ. 19:6).

ఇశ్రాయేలీయులను విడిచిపెట్టడానికి దేవుని తిరస్కరించింది, ఐగుప్తు నుండి విమోచించబడిన ప్రజల యెడల ఆయనకున్న ప్రేమను బట్టికాదు, కాని ప్రతిచోట ఉన్న ప్రజల యెడల ఆయనకున్న ప్రేమ వలన. అబ్రాహాము సంతానము ద్వార ప్రపంచమంతటిని దీవించాలనేది దేవుని ప్రణాళిక, మరియు ఆ సంతానం క్రీస్తు (గలతీ. 3:16). ఆయన ఇశ్రాయేలీయులను పరిపూర్ణంగా తిరస్కరిస్తే, ఆయన ప్రణాళిక నెరవేర్చబడేదికాదు; మరియు రక్షకుడు లేకుండా మానవాళియంతా నశించిపోయి ఉండేది.

---

సూచనలు

[1]ఈ ఒడంబడికల యొక్క మిగిలిన రెండు భాగములు ఒక పత్రములో వ్రాయు మాటగా (document clause) ఉన్నాయి మరియు ఒడంబడిక ఎక్కడ ఉంచబడుతుంది మరియు దానికి సాక్ష్యులు ఎవరు అనే విషయాలను సూచిస్తుంది. (Gordon Wenham, "Covenants and Near Eastern Treaties," in *Eerdmans' Handbook to the Bible*, ed. David Alexander and Pat Alexander [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1973], 198-99.) [2]"ఆహారము"గా అనువదించబడిన హెబ్రీ పదము (לֶחֶם, *లెఖెమ్*) అక్షరార్థంగా "రొట్టె" అని అర్థము. [3]John E. Hartley 26:10ని ఈ విధముగా వివరించెను: "ఈ వచనము విస్తారమైన పంటల శ్రేణిని చిత్రీకరిస్తుంది. ఎండిపోయి నిలువచేయబడిన పాత దానిని ప్రక్కనపెట్టినట్లైతే, క్రొత్తవాటిని ఎండఒక్క బెట్టుటకు స్థలము ఉంటుంది" (John E. Hartley, *Leviticus*, Word Biblical Commentary, vol. 4 [Dallas: Word Books, 1992], 463). [4]"తిరస్కరించు" (גָּעַל, *గాఅల్*) అని అనువదించబడిన హెబ్రీ పదము అక్షరార్థంగా "అసహ్యపడుట" అని అర్థము.

[5]Matthew Henry, *Commentary on the Whole Bible*, New One Volume Edition, ed. Leslie F. Church (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1960), 140. [6]అధ్యాయములో అనేక పర్యాయములు "ఏడు మారులు" ప్రజలను శిక్షించాలని దేవుడు భయపెట్టెను (26:18, 21, 24, 28). హెబ్రీ పదబంధము బాధలు ఎన్ని అనే విషయమును గూర్చి వివరించక దేవుడిచ్చు శిక్ష యొక్క తీవ్రతను వివరిస్తుంది. [7]"అడవిమృగములు" ప్రాణాంతక ఫలితములను కలిగియున్న అన్నివిధములైన విపత్తులకు ప్రతీకాత్మకంగా ఉపయోగించబడుతుంది: అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, జంతువుల దాడులు, మరియు తిరుగుబాటుదారుల ద్వార దాడులు. బహుశా విపత్తుల కలయిక వలన జనాభాసంఖ్యతగ్గుతుంది, మరిముఖ్యంగా పిల్లలను చంపుతుందనిన ఆలోచనను ఇస్తుంది. [8]Roy Gane, *Leviticus, Numbers*, The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan, 2004), 453. [9]అదే హెబ్రీ పదము (פֶּגֶר, *పెగెర్*) చనిపోయిన ఇశ్రాయేలీయులకు ఉపయోగించబడుతుంది మరియు జీవములేని విగ్రహముల కొరకు కూడా ఉపయోగించబడుతుంది. మరింత అక్షరార్థ అనువాదం ESVలో ఉంది: "మీ *పీనుగులను . . .* విగ్రహముల *పీనుగులపై* ఉంచెదను" (వక్కాణం చేర్చబడెను). [10]మూడు విషయాలు ఉపయోగించుటకు బదులుగా John H. Hayes ప్రశ్నకు ఐదు పాయింట్ల సమాధానమును ఇచ్చాడు: "మొదటిగా, వారు తమ దోషములను బట్టి మరియు తమ తండ్రుల దోషమును బట్టి వారు హృదయము పగిలినంత అనుభవమును పొందుతారు (వ. 39). రెండవదిగా, దేవుని చిత్తమునకు వ్యతిరేకముగా నడచుచు ఆయనకు విరుద్ధముగా చేసిన దోషములను బట్టి పాపములను ఒప్పుకొంటారు (వ. 40). మూడవదిగా, దేవుడు వారికి విరుద్ధంగా నడచి తమ శత్రువుల దేశములోనికి వారిని చెరలోకి పంపించడమును వారు జ్ఞాపకం చేసుకొంటారు (వ. 41). నాల్గవదిగా, వారు ఈ పనిని చేసిన తరువాత అప్పుడు వారు వారి యొక్క కఠినమైన హృదయములను సున్నితము చేసుకొంటారు మరియు ఐదవదిగా, చెరలో నివాసము చేయుట ద్వార మరియు బాధించబడుట ద్వార దోషములను జరిగించుట మరియు వారి పాపములను బట్టి ప్రాయశ్చిత్తము నొందుట (వవ. 41, 43)" (John H. Hayes, "Leviticus," in *Harper's Bible Commentary*, ed. James L. Mays [San Francisco: Harper & Row, 1988], 180).

[11]CEVలో 26:44కి ఈ అనువాదము ఉంది: "నీవేమి చేసినను సరే నేను మీ దేవుడైన యెహోవాను మరియు నీ శత్రువుల దేశములో నిన్ను పూర్తిగా అసహ్యించుకొనను లేదా నిన్ను పూర్తిగా తిరస్కరించను." [12]ఈ వాక్యభాగములోని దేవుని మాటలు ఇశ్రాయేలీయులు ఎప్పుడు తిరస్కరించి ఎప్పుడు చెరగొనిపోబడతారు అను సమయమును ఎదురుచూస్తున్నాయి. ఆ సందర్భమును నుండి, సీనాయి యొద్ద దేవునికి మరియు "వారి పితరులకు" మధ్య చేయబడిన నిబంధనను వారు జ్ఞాపకము చేసుకొంటారు. [13]"మోషే ద్వార" అనునది అక్షరార్థంగా "మోషే చేతి ద్వార" అని చెప్పబడుతుంది. [14]వ్యాఖ్యానకర్తలు సహజముగా అధ్యాయము 26ని చివరి అధ్యాయముగా మరియు 27 అధ్యాయమును అంత్రముగా చూస్తుంటారు. [15]R. Laird Harris, "Leviticus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers*, ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1990), 648. ఈ వచనములోని "'సీనాయి పర్వతములో' అను వ్యక్తీకరణ ముఖ్యముగా [లేవీయకాండము 25:1] వైపు చూపుతున్నప్పటికీ, ఇది పుస్తకమంతటి యొక్క ముగింపును చుపుతుందే గాని, నిబంధన నియమము యొక్క ఆరంభము నుండి కాదు [నిర్గమకాండము 25]" అని C. F. Keil and F. Delitzsch వ్యాఖ్యానించారు. (C. F. Keil and F. Delitzsch, *The Pentateuch*, vol. 2, trans. James Martin, Biblical Commentary on the Old Testament [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959], 479.)